# శనార్తి తెలంగాణ

telanganarajyadhikaraparty.in

సంపుటి : 05 | సంచిక : 297 (కాంప్లిమెంటరీ కాపీ) | ఎడిటర్ : తీన్మార్ మల్లన్న | బుధవారం 17-06-2026 | పేజీలు : 2


## నీట్ కోసం టెలిగ్రామ్‌కు తాత్కాలిక బ్రేక్..!

- రీ-ఎగ్జామ్ దృష్ట్యా యాప్‌పై కేంద్రం ఆంక్షలు
- జూన్ 21న జరగనున్న నీట్ ఎగ్జామ్
- పరీక్ష పూర్తయ్యే వరకు కట్టుదిట్టమైన నిఘా
- పేపర్ లీక్‌లను అరికట్టడమే లక్ష్యం




2

## అక్రమ ఓట్లు తొలగిస్తే తప్పేంటి..?

- ముస్లీం వర్గాల్లో SIR ప్రక్రియపై కాంగ్రెస్ భయం పుట్టిస్తోంది
- ఓటు బ్యాంక్ రాజకియాల కోసం చిచ్చు పెడుతోంది
- రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర కట్టుబడి ఉంది
- తెలంగాణ రూ.10 లక్షల కోట్లు ఇచ్చింది
- కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్

2



## వెళ్లాలనుకునే వారు వెళ్లొచ్చు..!

- వారికి పూర్తి స్వేచ్ఛ ఉంది
- పార్టీకి వచ్చిన ఇబ్బందేమీ లేదు..!
- బలవంతంగా పార్టీలో ఉండమని ఎవరికీ చెప్పలేం
- కానీ, పార్టీ వీడిన వారు ఎప్పటికైనా పశ్చాత్తాపం పడటం మాత్రం ఖాయం
- ఇవాళ టైమ్ నాది కాకపోవచ్చు
- కానీ, రేపటి రోజు కాలం తప్పక సహకరిస్తుందని భావిస్తున్నా
- శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే

2

## తమిళనాడు రైతులకు గుడ్ న్యూస్

- రుణమాఫీపై సీఎం విజయ్ కీలక ప్రకటన
- రూ.75 వేల వరకు పంట రుణాల మాఫీ
- పెద్ద రైతులకు రూ.35 వేల చొప్పున మాఫీ
- సహకార బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకున్న అన్నదాతలకు వర్తింపు

2



# పంతాలు కాదు.. ప్రగతి కావాలే..

## ఆర్థిక సంక్షోభంలో హైదరాబాద్ మెట్రో

- మెట్రోకు రాజకీయ బ్రేక్
- నాడు ప్రపంచానికే ఆదర్శం.. నేడేమో అప్పుల కుప్ప
- అసలు హైదరాబాద్ మెట్రోకు ఏమైంది..?
- పీపీపీ వైఫల్యమా? రాజకీయ వైరుధ్యమా?
- అనిశ్చితిలో హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 నిధుల లాక్.. విస్తరణపై బ్రేక్..
- పాలకుల ఈగో వార్‌లో హైదరాబాద్ లైఫ్ లైన్
- జిహెచ్ఎంసీ ఎన్నికల స్టంటా?
- గ్లోబల్ సిటీకి భవిష్యత్తు గ్యారెంటీ ఉందా?
- మెట్రోపై కేంద్ర-రాష్ట్రాల మైండ్ గేమ్
- ఓట్ల వేటలో పాలకులు.. ట్రాఫిక్ నరకంలో సామాన్యులు..
- లాభాలు కార్పొరేట్‌కు.. అప్పులు పన్ను కట్టే జనానికా..?
- మెట్రో చుట్టూ తిరుగుతున్న రాజకీయ చక్రం
- పాలకుల పంతాల మధ్య నలిగిపోతున్న సామాన్యుడు
- ప్రభుత్వం మారినప్పుడల్లా రూటు మార్చాలా?.. మా కష్టాలు తీర్చేదెన్నడు?

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** రోజూ పొద్దున్నే లేస్తే చాలు.. ఆఫీసుకో, కూలి పనులకో వెళ్లడానికి సిటీ బస్సుల వెనుక ఉరుకులు పరుగులు.. మెట్రో పిల్లర్ల కింద కిలోమీటర్ల మేర స్తంభించిపోయే ట్రాఫిక్ నరకంలో గంటల తరబడి సగటు జీవి నిరీక్షణ. ఇదీ నిత్యం కోటి మందికి పైగా బతుకులీడుస్తున్న భాగ్యనగర సామాన్యుడి దైనందిన చిత్రం. గ్లోబల్ సిటీ అనీ, ఐటీ హబ్ అనీ రంగుల ప్రపంచాన్ని చూపిస్తున్న పాలకులు.. తమ అవసరాల కోసం.. ఓట్ల వేట కోసం గద్దెనెక్కినప్పుడల్లా మెట్రో రూట్లను మార్చేస్తుంటే.. సగటు పౌరుడి గుండెల్లో ఆవేదన కట్టలు తెంచుకుంటోంది. ఒకప్పుడు ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ ప్రాజెక్టుగా వెలిగిన హైదరాబాద్ మెట్రో.. నేడు రూ.13,600 కోట్ల అప్పుల ఊబిలో, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల అహంకారాల (ఈగో వార్) మధ్య చిక్కుకుని పట్టాలు తప్పింది. పాలకుల పంతాల వల్ల ఫేజ్-2 విస్తరణ పనులు కాగితాలకే పరిమితమవడంతో, నగర శివార్లలోని సామాన్యులకు మెట్రో ప్రయాణం కేవలం ఒక కలగానే మిగిలిపోతోంది. "రాజకీయాల కూత ఆగదు.. సామాన్యుడి కష్టాల మెట్రో కదలదు" అన్నట్లుగా మారిన ప్రస్తుత పరిస్థితులపై, లీడర్ల మాటల యుద్ధం వెనుక దాగిన సగటు హైదరాబాద్ పౌరుడి నిఖార్సయిన ఆక్రోశం అంతులేనిది. ఒకప్పుడు దేశంలోనే రెండో అతిపెద్ద నెట్‌వర్క్‌గా వెలిగిన మన మెట్రో.. నేడు విస్తరణ లేక తొమ్మిదో స్థానానికి పడిపోవడం ఒక ఎత్తయితే.. నిత్యం ఐదు లక్షల మంది ప్రయాణించే ఈ వ్యవస్థ భవిష్యత్తు ఏంటన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

**అంతర్జాతీయ మోడల్ టు అప్పుల ఊబి..**

హైదరాబాద్ మెట్రో మొదటి దశ (69.2 కి.మీ) విజయవంతంగా నడుస్తున్నట్లు పైకి కనిపిస్తున్నా.. లోపల ఆర్థిక పరిస్థితి అతలాకుతలమైంది. ప్రాజెక్టు నిర్వహణ భారాన్ని మోస్తున్న తరువాయి 2లో...



## బహుజనుల రాజ్యం టీఆర్పీతోనే సాధ్యం

### బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఐక్యంగా ముందుకు కదలాలి

- వివిధ సంఘాల నాయకులు, యువత వేలాదిగా తరలిరావాలి
- "రాజ్యాధికార సమరభేరి" సభను విజయవంతం చేయాలి
- టీఆర్పీ రాష్ట్ర నాయకుల పిలుపు
- రోజురోజుకు సభకు మద్దతు పెరుగుతోందని వెల్లడి
- కార్మికులు, పలువురు ప్రముఖులకు సభ ఆహ్వాన పత్రికలు అందజేత



2



## హీట్ వేవ్ తగ్గలే..

### మందకొండిగా రుతుపవనాలు

- ఉత్తర తెలంగాణకు ఐఎండీ అలర్ట్
- 40 డిగ్రీలు దాటుతున్న ఉష్ణోగ్రతలు
- మే నెల తరహాలో ఎండలు
- 4 రోజుల్లో ఉష్ణోగ్రతలు తగ్గే ఛాన్స్

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** తెలంగాణలో వాతావరణ పరిస్థితులు మళ్లీ ఆందోళనకరంగా మారాయి. ఆషాఢ మాసం అడుగుపెడుతున్నా నైరుతి రుతుపవనాల కదలికలు మందగించడంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు ఆశించిన స్థాయిలో కురవడం లేదు. ఫలితంగా భానుడి భగభగలు మళ్లీ మొదలయ్యాయి. ప్రధానంగా ఉత్తర తెలంగాణ ప్రాంతంలో తరువాయి 2లో...

## ప్రిస్క్రిప్షన్ తప్పనిసరి

- డైరెక్ట్ దగ్గుమందు ఇయ్యరు
- కేంద్ర ఆరోగ్య శాఖ కీలక నిర్ణయం
- 1945 మెడిసిన్ నిబంధనల్లో మార్పులు
- షెడ్యూల్ కె జాబితా నుంచి తొలగింపు
- గతేడాది 22 మంది చిన్నారులు మృతి

2






## నైరుతి వచ్చింది.. వానలేవీ..!?

### రోహిణి కార్తె అయిపోయే..!

- మృగశిర కార్తె సగం పాదం చొరబట్టే..!
- అయినా జాడలేని వానలు..!
- ఖరీఫ్ సాగుపై అన్నదాత ఆందోళన..!
- గత ఏడాదితో పోలిస్తే ఈసారి తక్కువ వర్షపాతమేనా..?
- ఎల్‌నినో ప్రభావం ఉండొచ్చంటున్న శాస్త్రవేత్తలు..!
- అదే నిజమైతే వరుణ దేవుడి కరుణ కష్టమే..!
- భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం..!
- కరువు సంకేతాలపై ఐఎండీ హెచ్చరిక..!

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్:** రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం రైతాంగాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. రోహిణి కార్తె ముగిసిపోయి, మృగశిర కార్తె సగం పాదం చొస్తున్నప్పటికీ అనేక ప్రాంతాల్లో సరైన వర్షాలు లేకపోవడంతో ఖరీఫ్ పనులు మందగిస్తున్నాయి. సాధారణంగా ఈ సమయానికి అన్నదాతలు మెట్ట ప్రాంతాల్లో మొక్కజొన్న, ఇతరత్రా విత్తనాలు విత్తుకునేటోళ్లు. తరువాయి 2లో...

## బోనాల జాతర షురూ

**జూలై 19న ఘటాల ఊరేగింపు**

**ఆగస్టు 2న లష్కర్ బోనాలు**

**3న భవిష్యవాణి**

**తొలి బోనం గోల్కొండ జగదాంబికకే..**

**ఆషాడమాసంలో తొలి గురు, ఆదివారాల్లో పూజలు**

**బోనాలకు వందల ఏండ్ల నాటి చరిత్ర**

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతిరూపంగా నిలిచే ఆషాఢ మాస లష్కర్ బోనాల ఉత్సవాలకు ముహూర్తం ఖరారైంది. సికింద్రాబాద్‌లోని ప్రసిద్ధ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి జాతర మహోత్సవాల తేదీలను ఆలయ అర్చకులు, అధికారులు అధికారికంగా వెల్లడించారు. ఈ వేడుకల షెడ్యూల్ వివరాలను హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తరువాయి 2లో...



శనార్తి తెలంగాణ

Telangana News

బుధవారం 17-06-2026



# హీట్ వేవ్ తగ్గలే..

**మొదటిపేజీ తరువాయి..**

ఎండల తీవ్రత పెరగడంతో జనం అల్లాడిపోతున్నారు. రుతుపవనాల రాకలో జాప్యం కారణంగా ఉత్తర తెలంగాణలోని 10 జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తీవ్ర వడగాల్పుల హెచ్చరికలను జారీ చేసింది. వాతావరణ శాఖ నివేదికల ప్రకారం.. ఆదిలాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో ఎండ తీవ్రతతో పాటు వడగాల్పులు ఎక్కువగా ఉండనున్నాయి. ఈ జిల్లాల్లో ఇప్పటికే గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌ను దాటి నమోదవుతున్నాయి. జూన్ మధ్య కాలంలో కూడా మే నెల తరహాలోనే ఎండలు దంచికొడుతుండటంతో, తీవ్రమైన ఉక్కపోత,వడగాల్పుల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత వాతావరణ మార్పులపై హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి శ్రీనివాస్ వివరణ ఇస్తూ.. రుతుపవనాల పురోగతి నెమ్మదించడం వల్లే రాష్ట్రంలో వర్షాలు తగ్గి, ఉష్ణోగ్రతలు అకస్మాత్తుగా పెరిగాయని తెలిపారు. రాబోయే నాలుగు రోజుల్లో ఈ పరిస్థితుల్లో మార్పు వచ్చి, ఎండ తీవ్రత తగ్గే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు. ఉష్ణోగ్రతలు తగ్గేంత వరకు ప్రజలు, వృద్ధులు, చిన్న పిల్లలు మధ్యాహ్నం వేళల్లో అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

# వెళ్లాలనుకునే వారు వెళ్లొచ్చు..!

**శనార్తి తెలంగాణ, నేషనల్ డెస్క్:** మహారాష్ట్ర రాజకీయాల్లో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పార్టీని వీడాలనుకునే నేతలు, కార్యకర్తలను అడ్డుకునే ఉద్దేశం తమకు లేదని, ఎవరికైనా వెళ్లాలనిపిస్తే పూర్తి స్వేచ్ఛ ఉందని స్పష్టం చేశారు. బలవంతంగా పార్టీలో కొనసాగించాలని ఎవరినీ కోరబోమని తెలిపారు. పార్టీని వీడిన వారి వల్ల తమకు ఎలాంటి నష్టం లేదని, శివసేన సిద్ధాంతాలు, కార్యకర్తల బలమే తమ అసలైన బలమని చెప్పారు. పార్టీని వీడిన వారు భవిష్యత్తులో తప్పకుండా పశ్చాత్తాపం పడాల్సి వస్తుందన్నారు. ప్రస్తుతం కాలం తనకు అనుకూలంగా లేకపోయినా రాజకీయాల్లో పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవని, రాబోయే రోజుల్లో పరిస్థితులు మారుతాయనే నమ్మకం ఉందన్నారు. కష్టకాలాన్ని ఎదుర్కొంటున్నప్పటికీ పార్టీ పునర్వైభవం సాధిస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. కార్యకర్తలు నిరుత్సాహపడకుండా ప్రజల్లోనే ఉండాలని, పార్టీ కోసం పని చేయాలని పిలుపునిచ్చారు.

# పిల్లలకు పెట్టే పప్పు, గుడ్లలో రూ.2000 కోట్లు స్కాం చేశారు..!

## కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు విమర్శలు

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** గురుకుల పాఠశాలల్లో పిల్లలకు పెట్టే గుడ్లు, పప్పులో రూ.2000 కోట్ల స్కామ్ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని.. పిల్లలకు పెట్టే గుడ్లు, పప్పులో ఎవరైనా స్కామ్ చేస్తారా..? అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదులో భాగంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. "మంత్రి అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్ నాకు ఛాలెంజ్ విసురుతున్నారు.. మేము కొన్నదే రూ.650 కోట్లకు కొంటే రూ.2000 కోట్ల స్కామ్ ఎక్కడి నుండి వచ్చిందని అంటున్నారు. మీ డిపార్టుమెంట్లో మంత్రులుగా ఉండి అసలు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితిలో మీరు ఉన్నారు" అని విమర్శించారు.
యూనిఫాంలు, బెల్ట కోసం రూ. 1200 కోట్ల టెండర్ పిలిస్తే, ఉప్పులు, పప్పులు, చికెన్ కోసం రూ.800 కోట్ల టెండర్ పిలిచారనీ.. రెండు కలిపితే రూ.2000 కోట్లన్నారు. టెండర్లు పిలిచిన విషయం ఈ మంత్రులకు తెలియకపోతే మీరు ఏం పాలన చేస్తున్నారో నాకు అర్థం కావడం లేదని హరీశ్ రావు ఎద్దేవ చేశారు. ముఖ్యమంత్రే మొత్తం టెండర్లు పిలిచి ఆ అనుముల అన్నా తమ్ముళ్లు మొత్తం మింగుతున్నారు.. అందుకే మీకు ఏమీ తెలియదనీ అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వర్లను చేస్తానని రేవంత్ రెడ్డి చెప్పాడు.. కోటి మంది మహిళలు కోటీశ్వర్లు కాలేదు కానీ అనుముల వారి నలుగురు అన్నా తమ్ముళ్లు మాత్రం కోటీశ్వర్లు అయ్యారని హరీష్ రావు విమర్శించారు.



# బోనాల జాతర షూరూ

**మొదటిపేజీ తరువాయి...**

ఆలయ కమిటీ ప్రతినిధులు అందజేశారు. ఈ ఏడాది ఆషాఢ మాసం జూలై 15న ప్రారంభం కానుండగా, లష్కర్ బోనాల ఉత్సవాలు జూలై 19 నుండి ఆగస్టు 3 వరకు వైభవంగా సాగనున్నాయి. జూలై 19 (ఆదివారం) సాయంత్రం 4 గంటలకు అమ్మవారి ఘటోత్సవం (ఎదుర్కోలు) వేడుకతో బోనాల జాతర అధికారికంగా ప్రారంభమవుతుంది. ఆగస్టు 2 తెల్లవారుజామున 4 గంటల నుండి ప్రధాన ఘట్టమైన అమ్మవారికి బోనాల సమర్పణ ఉత్సవం అత్యంత వైభవంగా జరుగుతుంది. ఆగస్టు 3 ఉదయం 8.30 గంటలకు ఉత్కంఠ రేపే ప్రసిద్ధ రంగం (భవిష్యవాణి) కార్యక్రమం, అనంతరం అమ్మవారి గజావాహన ఊరేగింపు నిర్వహించనున్నారు. లష్కర్ బోనాల తర్వాతి ఆదివారమే హైదరాబాద్ నగరంలోని ఇతర ప్రాంతాల బోనాల వేడుకలు జరగనున్నాయి. ఇదిలావుంటే.. హైదరాబాద్ బోనాల ఉత్సవాలకు వందల ఏళ్ల ఘన చరిత్ర ఉంది. చారిత్రాత్మక సంప్రదాయం ప్రకారం ఆషాఢ మాసం ప్రారంభమైన తొలి గురువారం, ఆదివారం నాడు మొట్టమొదటి బోనాన్ని గోల్కొండ కోటలోని జగదాంబికా అమ్మవారికి సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. అక్కడ తొలి బోనం సమర్పించిన తర్వాతే నగరంలోని మిగిలిన ప్రాంతాల్లో ఉత్సవాలు ఊపందుకుంటాయి. మహంకాళి జాతరకు మరో నెల రోజులే సమయం ఉండటంతో జంట నగరాల్లో ఇప్పుడే ఆధ్యాత్మిక కోలాహలం మొదలైంది.

# పంతాలు కాదు.. ప్రగతి కావాలే..

**మొదటిపేజీ తరువాయి...**

ఎల్‌అండ్‌టీ సంస్థకు ఏటా రూ.400 కోట్ల నష్టం వస్తుండడంతో ఫేజ్-2 పెట్టుబడుల మాట దేవుడెరుగు.. ఫేజ్-1 కూడా మా వల్ల కాదని చేతులెత్తేసింది. దీంతో రంగంలోకి దిగిన రాష్ట్ర ప్రభుత్వం 100 శాతం తామే టేకోవర్ చేసుకునేందుకు సిద్ధమైంది. ఎల్‌అండ్‌టీకి రూ.1,450 కోట్ల సెటిల్మెంట్ ఇవ్వడంతో పాటు దాదాపు రూ.13,600 కోట్ల అప్పును కూడా ప్రభుత్వమే భరించడానికి జీవో ఇచ్చింది. ఇక్కడే అసలు ట్విస్ట్ మొదలైంది. ఎల్‌అండ్‌టీకి ఉన్న 8.25% అధిక వడ్డీ అప్పులను తీర్చి, జపాన్ నిధులతో ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా కేవలం 4% తక్కువ వడ్డీకే రూ.13,600 కోట్ల రుణం తెచ్చుకునేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేశామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. కానీ ఈ ఫైల్‌ను కేంద్రం తొక్కేసిందని, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాజకీయ కుట్రలతో ఐఆర్ఎఫ్‌సీ నిధుల విడుదలను అడ్డుకుంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి బహిరంగంగా ఆరోపిస్తున్నారు. "కేంద్రం నిధులు ఇవ్వకపోతే నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ ఇవ్వండి.. మేమే 100% నిధులతో ఫేజ్-2 పూర్తి చేస్తాం" అని సవాల్ విసురుతున్నారు.

**రాష్ట్రం వాదన ఇలా.. కేంద్రం వాదన మరోలా..**

ఐఆర్ఎఫ్‌సీ సాధారణంగా అంత తక్కువ వడ్డీకి అప్పులు ఇవ్వదని, అసలు జీవోలో 4% వడ్డీ అనే స్పష్టత ఎక్కడుందని కేంద్ర అధికారులు ప్రశ్నిస్తున్నారు. అలైన్‌మెంట్ మార్పులు, పెరిగిన భూగర్భ స్టేషన్ల వ్యయంపై సాంకేతిక వివరణలు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, కేవలం రాజకీయ లబ్ధి కోసమే కేంద్రంపై బురద జల్లుతున్నారని కౌంటర్ ఇస్తున్నారు. "4% వడ్డీకే లోన్ రెడీ.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కావాలనే ఐఆర్ఎఫ్‌సీ నిధులు ఆపారు. ఎన్‌ఓసీ ఇస్తే మేమే చూసుకుంటాం." అని సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నారు. మరోవైపు "ఆ తక్కువ వడ్డీ రూమర్ మాత్రమే.. టెక్నికల్ వివరాలు ఇవ్వకుండా, అప్పుల భారాన్ని జనం నెత్తిన వేస్తూ రాజకీయం చేస్తున్నారు." అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పుకొచ్చారు.

**పాలకులకు ఓట్లు.. మాకు తిప్పలేనా?**

ఈ కేంద్ర-రాష్ట్ర రాజకీయ రగడ, ఒకరిపై ఒకరు



విసురుకుంటున్న మాటల తూటాల మధ్య నలిగిపోతున్నది మాత్రం సగటు హైదరాబాద్ వాసే. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు మెట్రో అనుసంధానం, సీఎం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 30వేల ఎకరాల భారత్ ఫ్యూచర్ సిటీ (ఫోర్త్ సిటీ) మెట్రో విస్తరణ, పాతబస్తీ కారిడార్ పనులు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. నిత్యం ట్రాఫిక్ నరకంలో గంటల తరబడి నలిగిపోయే ఐటీ ఉద్యోగికి, సామాన్య కూలీకి పాలకులు మారినప్పుడల్లా రూట్లు మారడం తప్ప ప్రయాణ కష్టాలు తీరడం లేదు. టేకోవర్ కోసం ఇప్పటికే రాష్ట్ర ఖజానా నుంచి రూ.1,660 కోట్లు ఖర్చు చేసినా యాజమాన్య బదిలీ కాలేదు. రేపు మెట్రో నష్టాలన్నీ ప్రభుత్వమే భరిస్తే ఆ భారం పడేది పన్నులు కట్టే సామాన్యుడి పైనే కదా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. రానున్న హైదరాబాద్ నగర పాలక ఎన్నికల నాటికి ఈ వివాదాన్ని సజీవంగా ఉంచి, ఓట్ల రాజకీయం చేయడానికే ఇరు పక్షాలు ప్రాధాన్యత ఇస్తున్నాయనే ఆవేదన ప్రజల్లో స్పష్టంగా కనిపిస్తోంది.

**కావాల్సింది పంతాలు కాదు.. ప్రగతి..**

హైదరాబాద్ మెట్రో వివాదం కేవలం ఒక ఆర్థిక సమస్యో, లేదా లీగల్ వివాదమో కాదు. ఇది గ్లోబల్ సిటీగా ఎదుగుతున్న హైదరాబాద్ భవిష్యత్తు రవాణా వ్యవస్థకు, ఇక్కడికి వచ్చే పెట్టుబడులకు సంబంధించిన కీలకమైన అంశం. రాజకీయాలు ఎప్పుడూ ఉంటాయి, కానీ నగర అభివృద్ధి ఎప్పటికీ ఆగిపోకూడదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ పంతాలను పక్కనబెట్టి.. టేబుల్ మీద కూర్చుని సాంకేతిక లోపాలను సవరించుకోవాలి. ఐఆర్ఎఫ్‌సీ నిధుల విడుదలకు, ఫేజ్-2 డీపీఆర్ క్లియరెన్స్‌కు అడ్డుగా ఉన్న సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలి. పాలకుల మాటల యుద్ధం ముగిసి.. మెట్రో లైన్ల నిర్మాణ యుద్ధం మొదలైనప్పుడే హైదరాబాద్ సామాన్య పౌరుడి కష్టాలకు బ్రేక్ పడుతుంది.

# నైరుతి వచ్చింది.. వానలేవీ..!?

**మొదటిపేజీ తరువాయి..**

అలాగే వరి నాడు మడులు సిద్ధం చేసుకుని తుకాలు పోసుకునేటోళ్లు. కానీ, ఇప్పటి వరకు వర్షాలు కురవకపోవడంతో ఈసారి రైతులు ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు. పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, కందులు వంటి పంటల సాగు వర్షాలపైనే ఆధారపడి ఉండటంతో ఆలస్యం పెరిగే కొద్దీ రైతుల్లో ఆందోళన కూడా పెరుగుతోంది. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకున్న రైతులు వర్షాలు పడకపోవడంతో అయోమయంలో ఉన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా సాధారణం కంటే మెరుగైన వర్షాలు కురవడంతో ప్రతీ ఏటా మెరుగ్గా సాగిన వ్యవసాయ ఈసారి మాత్రం అనిశ్చితి పరిస్థితిని ఎదుర్కొంటోంది. జూన్ మొదటి పదిహేను రోజుల్లో దేశ వ్యాప్తంగా నమోదైన వర్షపాతం కూడా సాధారణ స్థాయి కంటే గణనీయంగా తక్కువగా ఉండటం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. వర్షాలు మరికొన్ని రోజులు ఆలస్యమైతే ఖరీఫ్ సాగు విస్తీర్ణంపైనా ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.
ఈ ఆందోళనలకు ప్రధాన కారణంగా ఎల్‌నినో ప్రభావమేనని వాతావరణ శాఖ చెబుతోంది. పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల ఏర్పడే ఎల్‌నినో భారత రుతుపవనాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే ఎల్‌నినో పరిస్థితులు మరింత బలపడే అవకాశముందని ఐఎండీ హెచ్చరించింది. ఈ ఏడాది జూన్-సెప్టెంబర్ కాలానికి దేశవ్యాప్తంగా సాధారణ వర్షపాతంలో కేవలం 90 శాతం మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేస్తోంది. అంతేకాదు వర్షాధార వ్యవసాయం అధికంగా ఉండే ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని స్పష్టం చేసింది. గతంలో 2014, 2015 సంవత్సరాల్లో నమోదైన వర్షాభావ పరిస్థితులు రైతాంగాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. అదే తరహా పరిస్థితులు పునరావృతమైతే వ్యవసాయ రంగ ప్రభావం, పంటల దిగుబడులు తగ్గడం..తద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన ఎఫెక్ట్ పడడం ఖాయమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.
వర్షాలు తగ్గితే దాని ప్రభావం కేవలం పొలాలకే పరిమితం కాదు. చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలోకి నీటి ప్రవాహం తగ్గిపోవడంతో భూగర్భ జలాలపై ఒత్తిడి పెరుగుతుంది. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో భూగర్భ నీరు మరింత లోతుకు వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలోనే వర్షాభావ పరిస్థితులు నెలకొని తాగునీటి సమస్యలు కూడా తలెత్తే ప్రమాదం ఉంది. పశుగ్రాస కొరత, విద్యుత్ అవసరాల పెరుగుదల, వ్యవసాయ పెట్టుబడులపై భారం వంటి సమస్యలు వరుసగా ఎదురయ్యే అవకాశం ఉంది. మరోవైపు వర్షాలు తగ్గి ఉష్ణోగ్రతలు పెరిగితే కూరగాయలు, పండ్ల ఉత్పత్తి తగ్గి ధరలు పెరిగే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.రుతుపవనాల సీజన్ ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నందున జూలై, ఆగస్టు నెలల్లో బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడనాలు పరిస్థితిని మార్చే అవకాశం కూడా ఉంది. అప్పటి వరకు రైతాంగం ఆశలు, ఆందోళనలు మాత్రం ఆకాశంలోని మేఘాల చుట్టే తిరుగుతుండడం గమనార్హం.

# నీట్ కోసం టెలిగ్రామ్‌కు తాత్కాలిక బ్రేక్..!

**శనార్తి తెలంగాణ, నేషనల్ డెస్క్:** జూన్ 21న జరగనున్న నీట్-యూజీ 2026 రీ-ఎగ్జామ్ దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నీట్ పరీక్ష పూర్తి అయ్యే వరకు టెలిగ్రామ్ యాప్‌పై తాత్కాలిక ఆంక్షలు విధించింది. నీట్ ప్రశ్నపత్రాల లీక్, నకిలీ పేపర్ల విక్రయం, విద్యార్థులను మోసం చేసే ముఠాల కార్యకలాపాలను అడ్డుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) వెల్లడించింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు జూన్ 22 వరకు దేశవ్యాప్తంగా టెలిగ్రామ్ యాక్సెస్‌ను పరిమితం చేయనున్నారు. అలాగే జూన్ 30 వరకు మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌పైనా ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి. గతంలో టెలిగ్రామ్ ఛానళ్ల ద్వారా ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయంటూ తప్పుడు ప్రచారం జరగడం, భారీ మొత్తాల్లో డబ్బులు వసూలు చేసిన ఘటనలు వెలుగుచూడటంతో కేంద్రం ఈ చర్యలకు దిగింది. పరీక్ష పారదర్శకతను కాపాడటం, అభ్యర్థులను మోసాల నుంచి రక్షించడమే లక్ష్యమని ఎన్‌టీఏ స్పష్టం చేసింది.




# ప్రిస్క్రిప్షన్ తప్పనిసరి

**శనార్తి తెలంగాణ, న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా దగ్గు సిరప్‌ల విక్రయాలు, వాడకంపై కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన ఆంక్షలను విధిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై డాక్టర్ రాసిచ్చిన చిట్టీ (ప్రిస్క్రిప్షన్) ఉంటేనే మెడికల్ షాపుల్లో దగ్గు సిరప్‌లను విక్రయించాలనే నిబంధనను తీసుకువచ్చింది. ఈ మేరకు 'షెడ్యూల్ కె' నిబంధనలను సవరిస్తూ కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తుది ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఎలాంటి ప్రిస్క్రిప్షన్ లేకుండా నేరుగా కౌంటర్‌పై కొనుగోలు చేసే ఔషధాల జాబితాలో దగ్గు సిరప్‌లు ఉండేవి. తాజా సవరణతో ఈ మినహాయింపును కేంద్రం పూర్తిగా రద్దు చేసింది. దగ్గు ఉపశమనానికి వాడే లాజెంజెస్‌లు, పిల్స్ లేదా టాబ్లెట్‌లకు మాత్రం ఈ నిబంధన నుండి మినహాయింపునిచ్చారు. అవి మునుపటిలాగే నేరుగా లభిస్తాయి. దీనికి సంబంధించిన ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం గతేడాది డిసెంబర్‌లోనే విడుదల చేసి, సంబంధిత వర్గాల నుంచి సలహాలు, అభ్యంతరాలను స్వీకరించిన అనంతరం తాజాగా ఈ తుది నిర్ణయాన్ని ప్రకటించింది. గతంలో దేశంలోని పలు రాష్ట్రాల్లో చోటుచేసుకున్న విషాదకర సంఘటనలే కేంద్రం ఈ దిశగా అడుగులు వేయడానికి ప్రధాన కారణమయ్యాయి. మధ్యప్రదేశ్‌లోని ఛింద్వారా జిల్లాలో కలుషితమైన దగ్గు సిరప్ తాగడం వల్ల 22 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన దారుణ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. నాణ్యతా ప్రమాణాలు లోపించడం, ఎలాంటి వైద్య పర్యవేక్షణ లేకుండా విచ్చలవిడిగా ఈ మందులు విక్రయించడం వల్లే ఈ ముప్పు వాటిల్లిందని అధికారులు గుర్తించిన సంగతి తెలిసిందే


# అక్రమ ఓట్లు తొలగిస్తే తప్పేంటి..?

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** తెలంగాణ అభివృద్ధి విషయంలో కేంద్రం చిత్తశుద్ధితో ఉందని, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే ప్రసక్తే లేదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. మంగళవారం కరీంనగర్ జిల్లా మానకొండూరులో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. గత 12 సంవత్సరాలుగా తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ఏకంగా రూ. 10 లక్షల కోట్లు కేటాయించిందని బండి సంజయ్ తెలిపారు. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం వంటి ప్రధాన కార్పొరేషన్ల అభివృద్ధికి వేల కోట్ల రూపాయలను కేంద్రం మంజూరు చేసిందని గుర్తు చేశారు. కేంద్రం ఇచ్చిన నిధులు ఏమయ్యాయని, అవి ఏ విధంగా ఖర్చయ్యాయో రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.
అక్రమంగా ఉన్న ఓట్లను అధికారులు తొలగిస్తే అందులో తప్పేముందని బండి సంజయ్ ప్రశ్నించారు. ఓట్ల తొలగింపు వ్యవహారాన్ని అడ్డుపెట్టుకుని ముస్లిం సామాజిక వర్గంలో కాంగ్రెస్ పార్టీ లేనిపోని భయాలు కల్పిస్తోందని అన్నారు.కేవలం ఓటు బ్యాంక్ రాజకీయాల కోసమే ముస్లింల మధ్య కాంగ్రెస్ చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తోందని, సర్ ప్రక్రియను తప్పుబట్టడం వెనుక రాజకీయ స్వార్థం దాగి ఉందని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీపై కూడా బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పార్టీలో మావోయిస్టు భావజాలం ఉన్న నేతలు ఉన్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి ఉగ్ర, తీవ్రవాద భావజాలం ఉన్న నాయకుల వల్ల సమాజానికి తీవ్ర ప్రమాదం పొంచి ఉందన్నారు. ప్రజలు ఆలోచించాలని, బీఆర్ఎస్ లాంటి పార్టీలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని అన్నారు. తెలంగాణ మరింత వేగంగా అభివృద్ధి చెందాలంటే రాష్ట్రంలో 'డబుల్ ఇంజన్ సర్కార్' రావాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

# తమిళనాడు రైతులకు గుడ్ న్యూస్



**శనార్తి తెలంగాణ, నేషనల్ డెస్క్:** తమిళనాడు సీఎం విజయ్ రైతులకు భారీ ఊరటనిచ్చే నిర్ణయం తీసుకున్నారు. సహకార బ్యాంకుల ద్వారా 2025 మే 1 నుంచి 2026 ఫిబ్రవరి 28 వరకు పంట రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ అమలు చేయనున్నట్లు మంగళవారం కీలక ప్రకటన చేశారు. ఆ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో రూ.75 వేల వరకు పంట రుణం తీసుకున్న రైతులకు 100 శాతం రుణమాఫీ వర్తించనుంది. రూ.75 వేలకు మించి రుణం పొందిన రైతులకు రూ.35 వేల చొప్పున మాఫీ చేయనున్నారు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని 14.43 లక్షల మంది రైతులు లబ్ధి పొందనున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వంపై సుమారు రూ.5,932 కోట్ల భారం పడనుంది. రైతు సంఘాల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, ప్రస్తుతం ఉన్న ఆర్థిక పరిస్థితులను పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. రాబోయే సాగు సీజన్‌కు రైతులు కొత్త రుణాలు పొందేందుకు, ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కేందుకు ఈ రుణమాఫీ ఉపకరిస్తుందని సీఎం విజయ్ తెలిపారు.







# బహుజనుల రాజ్యం టీఆర్పీతోనే సాధ్యం

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో జులై 05న భువనగిరిలో నిర్వహించనున్న "రాజ్యాధికార సమరభేరి" మహాసభకు రోజురోజుకు మద్దతు పెరుగుతోంది. జూలై 5న జరగనున్న ఈ మహాసభను విజయవంతం చేయడానికి టీఆర్పీ రాష్ట్ర నాయకులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ ప్రజలను చైతన్యపరుస్తున్నారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీతోనే బహుజనుల రాజ్యాధికారం సాధ్యమవుతుందని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. వేలాదిగా తరలిరావాలి"రాజ్యాధికార సమరభేరి" సభను విజయవంతం చేయాలి పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా టీఆర్పీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజక్క RTC రాణిగంజ్ డిపో సంఘం నాయకులు, కార్మికులను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా పటేల్ వనజక్క మాట్లాడుతూ రాజ్యాధికార సమరభేరి సభకు RTC కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు, భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

**పలువురు ప్రముఖులకు ఆహ్వాన పత్రిక అందజేత**

ప్రముఖ గాయకుడు, ప్రజాకళాకారుడు తెలంగాణ విట్టల్, మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు సొప్పరి శంకర్ ముదిరాజ్, రిటైర్డ్ ప్రొఫెసర్ జయధీర్ తిరుమల రావుకు, ప్రముఖ జర్నలిస్టు, సామాజిక మాధ్యమకారుడు పాశం యాదగిరి ని వేరు వేరు గా కలిసి "రాజ్యాధికార సమరభేరి" ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణలో బహుజన వర్గాల రాజకీయ సాధికారత, సామాజిక న్యాయం, మీడియా పాత్ర, ప్రజా సమస్యలపై అవగాహన కల్పించడంలో సామాజిక మాధ్యమాల ప్రాధాన్యత వంటి అంశాలపై చర్చించారు. రాజ్యాధికార సమరభేరి సభ లక్ష్యాలను వివరిస్తూ బహుజన వర్గాల ఐక్యత అవసరాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏటిగడ్డ అరుణక్క, రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల ప్రవీణ్ రాజ్, ప్రముఖ జర్నలిస్ట్ సుదర్శన్ గౌడ్, రాష్ట్ర నాయకులు గిరగాని బిక్షపతి గౌడ్, బత్తినీ మీనాక్షి గౌడ్, నవీన్ పటేల్, అర్కటి శ్రీనిధి, తదితరులు పాల్గొన్నారు.

**హుస్నాన్ నగర్లో టీఆర్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య పర్యటన**

జల్ పల్లి మున్సిపాలిటీ పరిధిలోని పడిషరీఫ్ డివిజన్ హుస్నాన్ నగర్లో మాజీ కౌన్సిలర్ మహమ్మద్ మజార్ అలీని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి టీఆర్పీ సభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం హుస్నాన్ నగర్‌లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, ఉపాధి తదితర సమస్యలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు బొడ్డుపల్లి చంద్రశేఖర్, రంగారెడ్డి జిల్లా యువజన అధ్యక్షులు పాకాల నరసింహ, సంపత్, మహమ్మద్ గౌస్ భాయ్, కాజా పాషా, ఖయ్యూం, ముస్తఫా, సాజీత్, పరివేశ్, ఖలీల్, అప్సర్ తదితరులు పాల్గొన్నారు.